STATE INFORMATION CENTRE

704778

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
నెలకు	రు. 7—60	రు. 8—10
3 నెలలకు	22—60	24—30
6 నెలలకు	44—00	47—60
సంవత్సరమునకు	88—00	95—20

ఈరేటు అడ్వాన్సుగా చందా చెల్లించినవారికి మాత్రమే వర్తించును

VISALAANDHRA Phone No. 75301 Regd. No. H/VJ47

విశాలాంధ్ర

సంపుటి 26 సంచిక 113

విజయవాడ 17—8—76 మంగళవారం

12 పేజీలు 25 పైసలు

మంత్రిపదవులు శ్రీ చేబ్రోలు హనుమయ్యగారికి వే
మా శుభాభినందనలు
హోటల్ అలంకార్
ప్రొప్రయిటర్ : బొద్దులూరి సీతారామయ్య
ట్రంకురోడ్డు—గుంటూరు—1
ఫోన్ నెంబరు 21690

మానవేతిహాసంలో సామ్రాజ్యవాదాన్ని చిత్తుచేసే అధ్యాయం

అలీన ఉద్యమం లిఖించాలని శిఖరాగ్రసభలో సిరిమావో పిలుపు

కొలంబో, ఆగస్టు 16

సామ్రాజ్యవాదం, వలసవాదాల ఆయుధాలను చిత్తుచేసే నూతనాధ్యాయాన్ని మానవేతిహాసంలో లిఖించాలని శ్రీలంక ప్రధాని శ్రీమతి సిరిమావో బండారు నాయకే ఇచ్చిన పిలుపుతో ఐదవ అలీన శిఖరాగ్రసభ నేడిక్కడ ప్రారంభమయింది.

మహాసభ చర్చలకు ఒరవడిపెట్టే ఈ ప్రసంగాన్ని బండారు నాయకే అంతర్జాతీయ స్మారక భవనంలో ఆమె చేశారు. వర్తమాన ప్రపంచం తన సొంత ఆర్థిక వ్యవస్థను ఎన్నుకుంటే ప్రపంచ ఆర్థిక రంగంలో సామ్రాజ్యవాదుల గుత్తాధిపత్యం అంతమవుతుందన్నారు.

మానవాళిలో మూడింట రెండువంతులకు ప్రతినిధులైన అలీన దేశాల రాజులు, అధ్యక్షులు, ప్రధానులు ఆసీనులైన వేదిక ముందు ఫ్లడ్‌లైట్ల కాంతుల మధ్య ఆమె ప్రసంగం సాగింది: 'అలీనదేశాల పోరాటం ఏ దేశానికి, ఏ ప్రజలకూ వ్యతిరేకం కాదు. అన్యాయం, అవమానం, అసమానతలకూ, పురాతన సామ్రాజ్య భవనాలూ, జోక్యం, పెత్తనాలకూ వ్యతిరేకంగా యీ పోరాటం సాగుతోందన్నారు.

20 వ శతాబ్దంలో అలాంటి వాటికి తావులేదు. కనుక వాటికి ప్రతిఘటన కొనసాగించాలి.

శాంతి విశ్వవ్యాపిత హక్కు, దానికి బాధ్యతకూడా విశ్వవ్యాపితంగానే ఉండాలని అన్నారు,

ఇంతమంది ప్రపంచ నాయకులు ఒక చోటకలవడం ఎన్నడూ ఎక్కడా జరగలేదు.

పతాకాల సమాహారమైన వేదిక వెనుక నాలుగు ఖండాల ప్రజల విముక్తిని ప్రతిబింబించే కాంక్ష చిహ్నం ఉంది.

ఆసియాలో ప్రప్రథమంగా జరుగుతున్న మహాసభ ప్రారంభానికి చిహ్నంగా ధవళ వస్త్రధారులైన శ్రీలంక అధ్యక్షుడు విలియం గోపల్లవ సాంప్రదాయకమైన తైలజ్యోతిని వెలిగించారు. మగుల్ బెరా (మంగళవాద్యాలు) ధ్వనించాయి.

ఐదవ శిఖరాగ్రసభ ప్రారంభమైనట్లు అల్జీర్స్‌లోని నాల్గవ శిఖరాగ్రసభ అధ్యక్షుడు హౌరీబౌముదీన్ లాంఛనప్రాయంగా ప్రకటించారు.

శ్రీమతి సిరిమావో మొదట సింహళ భాషలో ప్రతినిధులకు స్వాగతం పలికారు కొద్ది వ్యాఖ్యల తర్వాత ఆమె ఇంగ్లీషులో గంటసేపు ప్రసంగించారు

ఐక్యరాజ్యసమితిలో అలీనదేశాల ధోరణి "మెజారిటీ దౌర్జన్యంగా" ఉందన్న తీవ్ర విమర్శను ప్రస్తావిస్తూ "అలీన ఉద్యమం దౌర్జన్యంగా ఎన్నడూ లేదు; ఎన్నడూ అలా ఉండదలచలేదు, ఎన్నడూ ఉండబోదు" అని స్పష్టం చేశారు.

ఏమైనా ఉంటే ప్రపంచంలోని ఇతర దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అది అత్యంత శక్తివంతమైన ఆయుధంగా ఉంది, ముఖ్యంగా గత పదు శతాబ్దాలుగా తృతీయ ప్రపంచం ఎదుర్కొన్న పేదరికం, ఆకలి, జబ్బులు, అకాల మరణాలు దౌర్జన్యాలకూ - అన్నిటికిమించి పీడితులకు ఆనందం - ఆశ - అంటూ కనిపించని దుస్థితికి వ్యతిరేకంగా పోరాడింది.

అలీన ఉద్యమంవల్ల పాత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను సవాల్ చేసేబలం తృతీయ ప్రపంచ దేశాలకు వచ్చింది.

నూతనంగా విముక్తిపొందిన అంగోలా, కేప్‌వర్డీ, సావోటోమ్ - ప్రిన్సిపే దీవులు, మొజాంబిక్, సెషెల్స్‌దీవులు తదితర కొత్త సభ్యులకు శ్రీలంక ప్రధాని సిరిమావో స్వాగతం పలికారు.

ఆ దేశాల ప్రతినిధుల ఆగమన సమయంలో 85 దేశాధిపతులు కరతాళధ్వనులతో హర్షం ప్రకటించారు

అర్ధశతాబ్దికిపైగా సాగిన సామ్రాజ్యవాదుల పెత్తనంనుండి మహత్తర విముక్తి సాధించిన వియత్నాం, లావోస్, కాంబోడియా ప్రజలకు ఆమె జేజేలు పలికారు యుద్ధంలో నాశనమైన వారి ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి అలీనదేశాల తోడ్పాటు ప్రకటించారు.

నానాటికీ విస్తరిస్తున్న అలీన ఉద్యమంలో చేరిన కొరియా జనతంత్ర ప్రజా రిపబ్లిక్, పాలస్తీనా విముక్తిసంస్థ, పనామాలకు హార్దిక స్వాగతం తెలిపారు

విదేశాంగ మంత్రుల సభలో అందరి ఆమోదం పొందిన మాల్దీవులకు గూడా ఆహ్వానం పలికారు.

శ్రీమతి గాంధీ పట్ల ఆదరం

ప్రధాని శ్రీమతి గాంధీ సభాస్థలికి ఉదయం 10 గంటలకు చేరారు.

అంతకు ముందామెను విమానాశ్రయం వద్ద కలుసుకోలేక పోయిన సిరిమావో హాలు మెట్లవద్ద ఎదురేగి కౌగలించుకుని ఆదరం చూపారు.

రాష్ట్రాలచే నూతన విద్యా పథకం ఆమోదం

లోకసభలో మంత్రి శ్రీ యాదవ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 16

విద్యకు సంబంధించిన నూతన విధానాన్ని (10+2+3) 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు యిప్పటికే ఆమోదించినట్లు విద్యాశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ డి. పి. యాదవ్ నేడు లోకసభలో వెల్లడించారు.

వాటిలో ఆంధ్ర, అస్సాం, బీహార్, గుజరాత్, జమ్మూ-కాశ్మీర్, కర్నాటక కేరళ, మహారాష్ట్ర, సిక్కిం, త్రిపుర, ఉత్తరప్రదేశ్ పశ్చిమబెంగాల్, అండమాన్, నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, చండీఘర్, దాద్రా, నగర్ హవేలి, ఢిల్లీ, గోవా, డామన్, డయ్యూ లక్కదీవులు వున్నాయి.

1977-78, 78-79 లలో ఏడు రాష్ట్రాలు యీ పథకాన్ని ప్రవేశ పెట్టనున్నాయని ఆయన తెలిపారు,

వాటిలో హర్యానా, హిమాచల ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, తమిళనాడ్, రాజస్థాన్, ఒరిస్సాలు వున్నాయి.

శ్రీ చేబ్రోలు హనుమయ్యకు రవాణాశాఖ

నూతన మంత్రుల ప్రమాణస్వీకారానంతరం ముఖ్యమంత్రిచే శాఖల కేటాయింపు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, ఆగస్టు 16

పునర్వ్యవస్థీకరించబడిన రాష్ట్రమంత్రి వర్గంలో కొత్తగా కాబినెట్ మంత్రిగా చేరిన శ్రీ చేబ్రోలు హనుమయ్యకు రవాణాశాఖ కేటాయించారు.

కొత్తగా ఆరుగురిని చేర్చుకున్న ఫలితంగా మంత్రివర్గ సభ్యుల శాఖల కేటాయింపుల్లో వచ్చిన మార్పులను ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నేటి సాయంత్రం పత్రికా గోష్ఠిలో యిలా ప్రకటించారు:

కొత్తగా స్టేట్ మంత్రులుగా చేరిన వారి పోర్టుఫోలియో ఇలా వున్నాయి.

శ్రీ కె బి. నరసప్ప: నిజాం షుగర్ ఫ్యాక్టరీ, కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, ఖండసారి యూనిట్‌తోసహా చక్కెర పరిశ్రమ, వెనుకబడిన తరగతుల సంక్షేమం.

శ్రీ వరకాల శేషావతారం: గ్రామీణాభివృద్ధి శాఖ

శ్రీమతి కృష్ణవేణి సంజీవయ్య: మహిళా సంక్షేమం, శిశు సంక్షేమం

ఎర్రా నారాయణస్వామి: లఘుపరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలు, చేయుం ఉపాధి పథకాలు, ఖాదీ గ్రామోద్యోగబోర్డు

శ్రీ పి ధర్మారెడ్డి: గృహనిర్మాణం అగ్రోఇండస్ట్రీస్ కార్పొరేషన్.

శ్రీమతి లక్ష్మీదేవి: పునరావాసం, చిన్న మొత్తాల పొదుపులు

శ్రీ మహేంద్రనాధ్: హరిజనసంక్షేమం, మార్కెటింగ్.

ఈ మార్పులు మినహా మిగతావారు ఇదివరకు శాఖలనే నిర్వహిస్తారు.

ప్రమాణస్వీకారం

నూతన మంత్రులు ఆరుగురు నేడిక్కడ మధ్యాహ్నం రెండుగంటలకు రాజభవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు

గవర్నర్ శ్రీ ఆర్ డి భండారి ప్రమాణ స్వీకారం చేయించారు.

కాబినెట్ హోదా మంత్రిగా శ్రీ చేబ్రోలు హనుమయ్య, సహాయ మంత్రులుగా శ్రీ కె బి నరసప్ప, శ్రీ వరకాల శేషావతారం, శ్రీమతి కృష్ణవేణి సంజీవయ్య, శ్రీ ఎర్రా నారాయణస్వామి, శ్రీ పి. ధర్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు

ప్రమాణ స్వీకారోత్సవం ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు, ఇతర మంత్రివర్గ సహచరులు, లెజిస్లేటర్లు, న్యాయమూర్తులు, పున్న తాధికార్ల సమక్షంలో నిర్వహించబడింది.

ప్రమాణ స్వీకారోత్సవం జరిగిన "రాజభవన్" హాలు ప్రేక్షకులతో క్రిక్కిరిసి పోయింది.

శ్రీ చేబ్రోలు హనుమయ్య, శ్రీ వరకాల శేషావతారంలు తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు.

అలీన ఉద్యమ పాత్రకు బ్రెజ్నేవ్ ప్రశంస

కొలంబో, ఆగస్టు 16

అలీన ఉద్యమసామ్రాజ్యవాద వ్యతిరేక, వలస వ్యతిరేక, జాత్యంహంకార వ్యతిరేక స్వభావాన్ని" సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి బ్రెజ్నేవ్ ప్రశంసించారు.

ఐదవ అలీన శిఖరాగ్రసభ అధ్యక్షురాలు శ్రీమతి సిరిమావో బండార నాయకేకు ఆయన సందేశం పంపారు.

ప్రపంచశాంతి, అంతర్జాతీయ భద్రత, విముక్త దేశాల స్వాతంత్ర్యం, ప్రగతిని పటిష్టత పరచేందుకు అలీన ఉద్యమం దోహదం చేస్తున్నదని పేర్కొన్నారు.

ఇంతటి ముఖ్యమయిన అంతర్జాతీయ వేదిక జయప్రదం కావాలని ఆకాంక్షించారు. "సామ్రాజ్యవాదం, యుద్ధం, దురాక్రమణ, వలసవాదం, నయా వలసవాదాలకు వ్యతిరేకంగా కృతనిశ్చయంతో పోరాడి, శాంతి, స్వాతంత్ర్యము, స్వేచ్ఛ, ప్రగతికోసం నిలిచే శక్తులను మరింత పటిష్ఠతం చేసేందుకు కృషి సాగిస్తామని" మహాసభలో పాల్గొన్న దేశాలన్నీ తమ కృతనిశ్చయాన్ని పునరుద్ఘాటించగలవని ఆశాభావం ప్రకటించారు.

చైనా సందేశం

"సామ్రాజ్యవాదం, వలసవాదం, పెత్తందారీ విధానాలకు" వ్యతిరేకంగా తృతీయ ప్రపంచం పోరాడాలని చైనా ప్రధాని హువాకో ఫెంగ్ సందేశంలో తెలిపారు.

"అనేక అలీన దేశాల మాదిరిగానే చైనా కూడా తృతీయ ప్రపంచానికే చెందుతుంది. అలీన దేశాలు స్వతంత్ర, శాంతి, తటస్థ పంథా అనుసరించడంలోనూ, సామ్రాజ్యవాదం, వలసవాదం, నయావలసవాదం, జాత్యహంకారం, జియోనిజం, అగ్రరాజ్య పెత్తందారీ తనాన్ని ప్రతిఘటించటంలోనూ చైనా తోడ్పాటు ఉంటుంది" అని పేర్కొన్నారు

కోటి టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యం

హైద్రాబాద్ సభలో ముఖ్యమంత్రి వెల్లడి

హైదరాబాదు ఆగస్టు 15

ఆంధ్రప్రదేశ్ ఈ సంవత్సరం ఒక కోటిటన్నుల ఆహారధాన్యాన్ని ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నేటి ఉదయం సికింద్రాబాదులోని పెరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో అన్నారు

ఇది గత సంవత్సరం కన్నా ఐదు లక్షల టన్నులు ఎక్కువని వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని సమీక్షిస్తూ ముఖ్యమంత్రి తెలియ జేశారు.

నిర్ణయించిన లక్ష్యాల సాధనకు "పని ఎక్కువ మాటలు తక్కువ" అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం గత సంవత్సరం 13 లక్షల టన్నుల ఆహారధాన్యాలు సేకరించిందని వీటిని లోటు రాష్ట్రాలకు సహాయ పడేందుకూ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఎక్కువ ఆహారధాన్యాలను పండించాలని ఆయన అన్నారు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు చెందిన పనులన్నీ నాలుగు సంవత్సరాల్లో పూర్తిచేసి ఆహారధాన్యాలు ఎక్కువగా పండించేందుకు సాగు క్రిందికి మరింత భూమిని తెస్తామని ఆయన అన్నారు

అత్యవసర పరిస్థితి ద్వారా సాధించిన ఫలితాలను సద్వినియోగ పరుచుకోవాలని, 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూ పరిమితి చట్టం క్రింద దాఖలు చేసిన నాలుగు లక్షల నలభైవేల డిక్లరేషన్లను అధికారులు పరిశీలించారని. దాని ద్వారా లభించనున్న దాదాపు ఐదు లక్షల ఎకరాల మిగులు భూమిని ఈ సంవత్సరాంతానికి స్వాధీనం చేసుకొని పేదప్రజలకు పంచుతామని ముఖ్యమంత్రి తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అభివృద్ధిపర చేందుకూ, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పారిశ్రామికాభివృద్ధి అవసరమని ఆయన అన్నారు.

విద్యుచ్ఛక్తి మిగులైందని, యితర రాష్ట్రాలకు యిప్పుడు కొంతమేరకు సాయం చేసే స్థితిలో వున్నామని ఆయన అన్నారు.

తొలుత ముఖ్యమంత్రి పెరేడ్‌గ్రౌండ్‌కు రాగానే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. భగవాన్‌దాస్ స్వాగతం చెప్పారు. పదాతి, వైమానిక, ప్రత్యేకసాయుధదళాలు హోంగార్డులు యిచ్చిన గౌరవ వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు. పది మంది

[మిగతా 2 వ పేజీలో]

సోవియట్‌కు 10 లక్షల కిలోల సిగరెట్ల ఎగుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 16

మూడుకోట్ల ముప్ఫయి నాలుగు లక్షల 20 వేల రూపాయల విలువగల 10 లక్షల కిలోల సిగరెట్లను భారత్ సోవియట్‌కు 1975-76లో ఎగుమతి చేసింది.

సోవియట్‌కే కాకుండా దుబాయ్, బంగ్లాదేశ్, బాహ్రెయిన్ దీవులు, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్‌లకు కూడా భారత్ సిగరెట్లను ఎగుమతిచేసినట్లు నేడు యిక్కడ విడుదలైన అధికార ప్రకటన తెలియజేస్తున్నది.

బుగ్గవంక రిజర్వాయర్‌పై ప్రాజెక్టు మంజూరు

కడప, ఆగస్టు 16

బుగ్గవంక రిజర్వాయర్‌పై మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ప్రభుత్వం మంజూరు చేసినట్లు కడప జిల్లా కలెక్టరు శ్రీ పి. ఎల్. సంజీవరెడ్డి తెలియచేశారు. కడప జిల్లాలోని ఇప్పపెంట గ్రామ సమీపంలో బుగ్గవంక రిజర్వాయర్ వుంది.

రిజర్వాయర్ పూర్తిగా సర్వే జరిపేందుకు లెవెలింగ్ కార్యకలాపాలకు లక్ష ఆరువేల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు.

శ్రీ లంక వీధుల్లో వేడుకలు

కొలంబో, ఆగస్టు 16

వానజల్లుకు కడిగిన ముత్యంలా ఉంది, శ్రీలంక రాజధాని, వీధులన్నీటా సంబరాలు, కొద్దిగంటల్లో అలీన శిఖరాగ్రసభ మొదలు కాబోతోంది.

అతిథు లొచ్చే మార్గానికి అటూ ఇటూ వేలాది ప్రజలు సూర్యోదయంనుండి ప్రవాహంలా చేరుతున్నారు. 85 దేశాధిపతులూ వారి బృందాలను తీసుకువెళ్ళే 500 కార్లు అంబారీ తరలిపోతోంది. సభజరిగె బండారు నాయకే అంతర్జాతీయ స్మారక భవనానికి అంతా వెళుతున్నారు.

ముచ్చటగా తయారైన స్కూలు పిల్లలు దారికు అటూఇటూ బారులుతీరి కొట్టొచ్చినట్లు కనబడుతున్నారు, పాటలు పాడుతూవాద్యాలు వాయిస్తున్నారు, కాని వేలాది ప్రజల హర్షధ్వానాల్లో ఆ సంగీతం మునిగి పోతోంది. దారి పొడుగునా సాయుధ పోలీసులునిలిచారు.

బండారు నాయకే హాలువద్ద దేశాధిపతులందరికీ ప్రధాని సిరిమావో స్వాగతంపలుకుతున్నారు, దేశాధిపతులంతా వేదికపై ఆసీనులుకాగా వారి బృందాలు హాల్లో అక్షర క్రమంలోఏర్పరచిన స్థానాల్లో కూర్చున్నారు. మంత్రి మైత్రి పాలసేనా నాయకే శ్రీమతి గాంధీకి స్వాగతం పలికారు.

ఆసియాలో ప్రప్రథమంగా జరగనున్న యీ మహాసభకు వచ్చిన శ్రీమతి గాంధీ వెంట 30 మంది సభ్యుల బృందం ఉన్నది. బృందంలో ఆమె కార్యదర్శి శ్రీ పి. యన్ ధార్, సమాచార సలహాదారు శారదా ప్రసాద్ ఉన్నారు.

విదేశాంగ మంత్రుల సభకై యిక్కడ వున్న భారత విదేశాంగ మంత్రి శ్రీ చావన్ విమానాశ్రయానికి వచ్చారు.

సాదత్, వాల్డ్‌హీం రాక

నిన్న మధ్యాహ్నం యిక్కడికి వచ్చిన ఈజిప్టు అధ్యక్షుడు సాదత్ వెంట 60 మంది సభ్యుల బృందం వుంది.

నిన్న రాత్రి సమేతంగా వచ్చిన ఐరాస ప్రధాన కార్యదర్శి వాల్డ్‌హీమ్ యిక్కడ మూడు రోజులపాటు ఉన్న తర్వాత న్యూయార్కు తిరిగివెళతారు.

బౌముదీన్-భుట్టో భేటీ

అల్జీరియా అధ్యక్షుడు హౌరీ బౌముదీన్, ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు మహమ్మద్ దావూద్‌లకు శ్రీలంక అధ్యక్షుడు విలియం గోపల్లవ స్వాగతం పలికారు.

బౌముదీన్ ఇక్కడికి వచ్చే ముందు కరాచీ విమానాశ్రయంలో అనుకోకుండా ఆగారు, పాకిస్తాన ఉత్తరాన వరద బాధిత ప్రాంతాల్లో పర్యటనను ప్రధాని భుట్టో మధ్యలో విరమించుకుని వచ్చి బౌముదీన్‌ను కలుసుకున్నారు భారతఉపఖండంపరిస్థితిపై వారు చర్చించారు. వరద బాధితులకు, పాక్ ప్రభుత్వానికీ అల్జీరియా అధ్యక్షుడు సానుభూతి తెలిపారు

భూటాన్ రాజా జిగ్మేసింగే వాంగ్ చుక్ నిన్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ ప్రత్యేక విమానంలో కొలంబో వచ్చారు.

శ్రీమతి గాంధి రాక

నేడిక్కడ ప్రారంభమయే అలీనశిఖరాగ్ర సభకు హాజరయేందుకు భారత ప్రధాని శ్రీమతి గాంధీ నేటి ఉదయం ఇక్కడికి వచ్చారు

మహాసభ రెండు గంటల్లో మొదలవుతుందనగా శ్రీలంక ప్రధాని అధికార నివాస గృహం "టెంపుల్‌ట్రీస్"కు ఆమె భారత వైమానికదళం హెలికాప్టర్‌లో వచ్చారు. మహాసభ జరిగే నాలుగురోజులూ ఆమె ఈ గృహంలోనే ఉంటారు

శ్రీలంక ప్రధాని తరఫున నేటి పారుదల

వియత్నాంకు బ్రహ్మరథం

కొలంబో, ఆగస్టు 16

సమైక్య వియత్నాం సోషలిస్టు రిపబ్లిక్ ప్రధాని ఫామ్‌వాన్ డాంగ్ నేడు అలీన సభ వేదిక నలంకరించినపుడు మొత్తం సభలోని వారంతా ఎదిలేచి లేచి కరతాళ ధ్వనులు హర్షధ్వానాలతో ఘన స్వాగతం పలికారు.

ఆతిథ్యమిస్తున్న శ్రీలంక తరఫున ప్రధాని సిరిమావో ఆయనకు 'ప్రత్యేక మైన ఆదారంతో స్వాగతం' చెప్పారు. "విదేశీ జోక్యానికీ పెత్తనానికీ, పీడనకూ వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న అన్ని దేశాలకు, అర్ధశతాబ్దిగా నిరామ మెరుగని పోరువల్సిన వియత్నాం విజయం వెల్లివిరిసిన ఉత్తేజం" అని స్వాగతం పలికారు.

ఫామ్‌వాన్‌డాంగ్ వేదికపైకి వెళ్ళినపుడు 85 దేశాల అధ్యక్షులూ, ప్రధానులూ బ్రహ్మరథం పట్టారు తమ ప్రజలూ వారి వీరోచిత పోరాటంలో హోచిమిన్ నాయకత్వం గురించి డాంగ్ ప్రస్తావించినపుడు "బండారు నాయకే" హాల్ దద్దరిల్లినట్లు కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

శ్రీమతి సిరిమావో ఎన్నిక

కొలంబో, ఆగస్టు 16

అలీన దేశాల అయిదవ శిఖరాగ్ర సమావేశం అధ్యక్షురాలిగా శ్రీలంక ప్రధానమంత్రి శ్రీమతిసిరిమావోబండారునాయకే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

18 మంది ఉపాధ్యక్షుల ఎన్నిక

విదేశాంగ మంత్రుల సమావేశం సిఫారసు మేరకు శిఖరాగ్ర సమావేశం 18 మంది ఉపాధ్యక్షులను నేడు ఎన్నుకుంది.

టిటోతో శ్రీమతి గాంధి భేటీ

కొలంబో, ఆగస్టు 16

భారత ప్రధాని శ్రీమతి గాంధీ యుగోస్లావియా అధ్యక్షుడు టిటోతో యీరోజు సమావేశం జరిపారు.

ఈ సందర్భంగా యూరప్‌లోని ఆసియా ప్రాంతంలోని పరిణామాలతో పాటు అంతర్జాతీయ వ్యవహారాలను వారు చర్చించారు.

ఈ సమావేశం బండారునాయకే స్మారక అంతర్జాతీయ సమావేశ కేంద్రంలో జరిగింది

శ్రీమతిగాంధీ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి నేటి ఉదయం ఇక్కడికి వచ్చిన అనంతరం చర్చలు జరపడం యిదే ప్రథమం.

ఆమె ఇక్కడ వున్న కాలంలో కొన్ని యితర దేశాల, ప్రభుత్వాధిపతులతో అభిప్రాయాలను మార్పిడి చేసుకో నున్నట్లు భావించబడుతోంది

మంగళ, బుధవారాల్లో శ్రీమతి గాంధీ చేయనున్న రెండు విందుల సందర్భంగా వారితో కొందరితో సమావేశం జరుపుతారు.

అత్యవసర పరిస్థితి ఎప్పుడు తొలగించేది ఇప్పుడే నిర్ణయించడం సాధ్యంకాదు

లోకసభలో హోం మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 16

అత్యవసర పరిస్థితి తొలగింపునుయిప్పుడే తేదీని నిర్ణయించడం అసాధ్యమని కేంద్ర హోంమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు లోకసభలో వెల్లడించారు.

ఒక సంవత్సరంపాటు మీసా చట్టం అత్యవసర నిబంధనలను పొడిగించడానికి వీలు కల్పించే బిల్లుపై చర్చకు సమాధానమిస్తూ ఆయన పైవిధంగా అన్నారు.

పైపైన ప్రశాంతంగా వున్నప్పటికీ అత్యవసర పరిస్థితి ప్రకటనకు కారణమైన శక్తులు రహస్యంగా తిరిగి సమీకృతమౌతున్నట్లు ఆయన వెల్లడించారు. అలానే మన జాతీయ ప్రయోజనాలపట్ల సహించని బయటిశక్తులు కూడా వీటితో కలుస్తాయని ఆయన తెలిపారు.

మోటారు స్పిరిట్ ధర తగ్గించేదిలేదు

శ్రీ మాలవీయ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 16

సమీప భవిష్యత్‌లో మోటారు స్పిరిట్ ధర తగ్గించేదిలేదని నేడు రాజ్యసభలో పెట్రోలియంమంత్రి శ్రీ కె డి మాలవీయ ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు.

దేశంలో పెట్రోలియం ఉత్పత్తులు దేశ అవసరాలకన్నా చాలాతక్కువగా వున్నాయని మన సాలీనా అవసరం 220 లక్షల టన్నులని ఆయన అన్నారు.

బొంబాయి హైలోని రెండు బావులలో లభ్యమయ్యే నూనెద్వారా మాత్రమే వాణిజ్యపరమైన ఉత్పత్తులు జరుగుతున్నాయని రెండులేదా మూడుబావుల్లో ఏ విలువైనదైనా పదార్థాలు లేవనీ, రెండులేదామూడుబావుల్లో కొద్దిపాటి నూనె, వాయువులు లభ్యమయ్యాయని ఆయన అన్నారు

మైసూరు మాజీ మహారాజా ప్రాసాదాల స్వాధీనపు బిల్లు

ముఖ్యమంత్రి వివరణ

బెంగుళూరు, ఆగస్టు 16

చుట్టుపక్కల భూములతో సహా మైసూరు, బెంగుళూరులలోని మైసూరు మాజీ మహారాజాకు చెందిన ప్రాసాదాలను స్వాధీనం చేసుకోడానికి వీలు కల్పించే ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వ ఆమోదానికై పంపడం జరిగిందని కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్ నేడిక్కడ వెల్లడించారు.

పత్రికల వారితో మాట్లాడుతూ ఆస్తికి నష్ట పరిహారాన్ని చెల్లించేందుకు సంబంధించిన నిబంధనలను బిల్లులో చేర్చడం జరిగిందని ఆయన తెలిపారు.

గోవధ నిషేధంపై వినోబాతో కమ్యూనిస్టునాయకులచర్చ

నాగపూర్, ఆగస్టు 16

భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీయుతులు ఎస్. ఎ డాంగే, చండ్ర రాజేశ్వర రావు, భూపేష్ గుప్తా, ఎ. బి. బర్ధన్‌లు నేడు వార్ధా సమీపంలోని పవనార్ ఆశ్రమంలో ఆచార్య వినోబాభావేతో గంటన్నర సేపు చర్చలు జరిపారు,

గోవధ నిషేధంతో సహా పలుముఖ్యసమస్యలను ఆచార్యతో చర్చించామని శ్రీ బర్ధన్ తరువాత 'సమాచార్' విలేకరికి తెలియజేశారు,

బహుళజాతులపై అదుపు కేంద్రం

కొలంబో, ఆగస్టు 16

బహుళజాతి కార్పొరేషన్ల కార్యకలాపాలపై గట్టి అదుపుపెట్టేందుకు ఒక సమాచార కేంద్రం ఏర్పరచే విషయాన్ని అలీన శిఖరాగ్ర సభ పరిశీలిస్తుంది.

జీవితభీమా కార్పొరేషన్‌చే 500 గృహాలు

కర్నూలులో

కర్నూలు అగస్టు 16

కర్నూలు పట్టణంలో 500 గృహాలను నిర్మించేందుకు జీవిత భీమా కార్పొరేషన్ అంగీకరించింది. ఈ కార్పొరేషన్ ఇంజనీర్ ఒకరు యిటీవల పట్టణంలో సందర్శించి కొన్ని స్థలాలను పరిశీలించినట్లు రాయలసీమ ప్రణాళికా అభివృద్ధి బోర్డు అధ్యక్షులు శ్రీ కె బి. నరసప్ప యిటీవల ఇక్కడ చెప్పారు.

నంద్యాల రహదారిలోని మాధవనగర్ గృహ నిర్మాణ సముదాయానికి ఆయన శంకుస్థాపన చేస్తూ పై విషయం తెలిపారు,

విచక్షణా రహితంగా కొత్త యూనివర్శిటీలు

లోకసభలో పలువురి ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 16

విచక్షణారహితంగా కొత్తయూనివర్శిటీ లనునెలకొల్పడాన్ని ప్రోత్సహించరాదన్నకొన్ని రాష్ట్ర ప్రభుత్వాల ధోరణివల్ల నేడు లోకసభలో సభ్యులు వెలిబుచ్చిన ఆందోళనలో విద్యామంత్రి శ్రీ నూరుల్ హసన్ పాలు పంచుకున్నారు.

శ్రీ కె లక్కప్ప ప్రశ్నకు సమాధానమిస్తూ, కొత్త యూనివర్శిటీలను స్థాపించడానికిగాను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించిందని వాటిని అనుసరించాలని శ్రీ హసన్ పేర్కొన్నారు.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ సహకారాన్ని అందచేయగలవన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. విద్యా ఉన్నత విద్యాప్రమాణాలకు ఎటువంటి అవరోధం వుండరాదని తెలిపారు.

ప్రయివేట్ కళాశాలల్లో బోధన ఉన్నత ప్రమాణం కలిగివుండకుండా చూడాలని కేంద్రం రాష్ట్రాలను కోరిందని కూడా ఆయన చెప్పారు

సరియైన ప్రమాణంలో విద్యను గడపడం లేదన్న కారణంగా ఏ కళాశాలను స్వాధీనం చేసుకోవడానికి కేంద్రానికి సాధ్యపడదని శ్రీ హసన్ అన్నారు ఈ అధికారాన్ని రాష్ట్రాలకే యివ్వడం జరిగిందన్నారు

శ్రీమతి మాయారే ప్రశ్నకు సమాధానమిస్తూ వృత్తిపరమైన యూనివర్శిటీలకు అనుకూలంగా కేంద్రం లేదని వాటి వ్యయాన్ని భరించడానికి సాధ్యంకాదని ఆయన అన్నారు.

శ్రీ బి. కె. దాస్ చౌదరి అనుబంధప్రశ్నకు సమాధానమిస్తూ నూతన విద్యాపథకాన్ని ప్రవేశపెట్టే విషయాన్ని త్వరితం జేయాలని కేంద్రం అభిప్రాయ పడుతున్నట్లు ఆయన చెప్పారు

విశాలాంధ్ర
1976 ఆగస్టు 17 మంగళవారం

అమానుష కాండ

సర్వతంత్ర స్వతంత్ర మొజాంబిక్ సరిహద్దులను ఉల్లంఘించి, న్యాగోమియా గ్రామంపై పాశవికమైన దాడిచేసి దాదాపు 620 మందిని బలిగొన్న రొడీషియా సైన్యాల ఘాతుక చర్యలు, పొంగిపొరలి వస్తున్న జింబాబ్వే విముక్తిపోరాటం మహావెల్లువను తట్టుకోలేక అతలాకుతలం అవుతున్న అల్ప సంఖ్యాక శ్వేతజాతి దురహంకారి ఇయాన్‌స్మిత్ మతిచెడిన బర్బరత్వానికి నిదర్శనం తప్ప యింకొకటికాదు. అన్యాయంగా ఆర్జించిన ఆస్తిని, సంపదను వదలివేసి మూకుమ్మడిగా దేశాన్నుండి నిష్క్రమిస్తున్న శ్వేతజాతీయుల సడలుతున్న మనోనిబ్బరాన్ని నిలబెట్టుకోనేందుకు చేసే తుది యత్నానికి యిది మచ్చుతునక. ఈ దాడిలో నిరాయుధులైన స్త్రీ, పురుషులతోపాటు అమాయకులైన అనేకమంది పసిబిడ్డలు బలి అయ్యారు.

దాదాపు ఒకటిన్నర సంవత్సరాల క్రితం జింబాబ్వే విముక్తి పోరాట సంస్థలు, లుసాకాలో విలీనంఅయ్యి, దశాబ్దాలుగా 60 లక్షల అధిక సంఖ్యాక ప్రజలపై 3 లక్షల మంది శ్వేతజాతి అల్పసంఖ్యాకవర్గ ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండను శాశ్వతంగా అంతమొందించి జింబాబ్వే ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధించాలన్న దీక్షతో సాయుధ పోరాటం ఉధృతం చేసినప్పటినుండీ ఇయాన్‌స్మిత్ యిరుగు పొరుగు దేశాలైన మొజాంబిక్, జాంబియా, బోట్స్వానా తదితర దేశాలపై యిలాంటి దాడులకు పూనుకొంటూ వున్నాడు. యుద్ధవిమానాల ద్వారా బాంబులు కురిపించి "గెరిల్లాల పరివేత" సాకుతో నీచాతినీచమైన దుర్మార్గాలకు పాల్పడుతున్నాడు.

కాసుకు అమ్ముడుపోయి వియత్నాం, అంగోలా, మొజాంబిక్ తదితర విమోచనోద్యమాలకు వ్యతిరేకంగా పాల్గొన్న శ్వేతజాతి కిరాయి మూకలను ఉపయోగిస్తూ అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర పెట్టుబడిదారీదేశాల మారణాయుధాలతో అధికారాన్ని నిలబెట్టుకోవాలను కొంటున్న స్మిత్ ప్రభుత్వం "రాజ్యాంగ సంబంధమైన చర్చలను" భగ్నంచేసి తమ దాసులైన కొంతమంది గిరిజన నాయకులకు పార్లమెంటులో, ప్రభుత్వంలో నామక స్థానం కల్పించి తమ శ్వేతజాతి దురహంకారపాలనను శాశ్వతంగా కొనసాగించాలనిచూస్తున్నది

జింబాబ్వే ప్రజల విమోచన పోరాటానికి సహాయ సహకారాలనుఅందచేస్తున్నఆఫ్రికా రాజ్యాలపై కసితో కార్పణ్యంతో వాటి సర్వస్వతంత్ర సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను, అంతర్జాతీయ నియమనిబంధనలను ఉల్లంఘించి దాడులు కొనసాగించి యిరుగు పొరుగు దేశాలపై బీభత్సకాండ జరుపుతున్నది.

ఎన్ని దుష్ట పన్నాగాలకు పాల్పడినా, పెట్టుబడిదారీ దేశాలనుండి సమకూర్చుకున్న అణు బాంబులను చూపించి జడిపించినా ఆఫ్రికా అంతటా ఉవ్వెత్తున విజృంభిస్తున్న స్వాతంత్ర్య పోరాటం ప్రభావంతో ఉత్తేజితమైన జింబాబ్వే విమోచనోద్యమాన్ని రొడీషియా ప్రధాని ఇయాన్‌స్మిత్ అడ్డుకోవడం కలలోని మాట. జింబాబ్వేలో అధిక సంఖ్యాకుల పాలన ఏర్పడేంతవరకు శాంతి, స్వాతంత్ర్యం, సమానతలు సాధించేవరకు యీ మహోద్యమం కొనసాగుతుంది. దానికి ప్రపంచంలో ప్రగతిశీల ప్రజాతంత్ర శక్తుల సంపూర్ణ సహకారాలు తప్పక లభిస్తాయి.

లఘు పారిశ్రామికదార్ల సౌకర్యార్థం అయిదు వాణిజ్య కేంద్రాల ఏర్పాటు

బొంబాయి సభలో కేంద్రమంత్రి శ్రీ శర్మ వెల్లడి

బొంబాయి, ఆగస్టు 16

లఘు పారిశ్రామిక దారులకు, ఎగుమతి దారులకు సమన్వయం చేయబడిన మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే నిమిత్తం దేశంలో అయిదు వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర పరిశ్రమల స్టేట్ మంత్రి శ్రీ ఎ. పి. శర్మ తెలిపారు.

"ఎగుమతి సహాయం, ఎగుమతుల అభివృద్ధి" అన్న అంశంపై లఘు పరిశ్రమల సర్వీస్ సంస్థ, బొంబాయి పరిశ్రమల అసోసియేషన్ యిటీవల ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ప్రారంభోత్సవం చేస్తూ పై విధంగా తెలియచేశారు.

వాణిజ్య సంబంధాల పెంపు, పర్మనెంట్ ఎగ్జిబిషన్, సమాచారం డాక్యుమెంటేషన్ సర్వీసులవంటి అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల ఉత్పత్తుల అభివృద్ధికి సహాయం, ఉత్పత్తుల పరీక్ష, ప్రామాణీకరణలు తదితరాల విషయంలో కొనుగోలు దారులకు, అమ్మకం దారులకు ఈ కేంద్రాలు సహాయం చేయగలవని అన్నారు.

జయప్రకాశ్ నాయకత్వానికి స్వస్తి

రాంస్వరాజ్ సంస్థ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 16

జయప్రకాశ్ నాయకత్వాన సర్వసేవా సంఘాల్లోని ఒకగ్రూపు ఆందోళనపై వైఖరితో విభేదించిన కొంతమంది సర్వోదయ కార్యకర్తలు 'రాం స్వరాజ్' అనే ఏర్పాటును ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు

ఈ వారం ప్రారంభంలో మధురలో కుమారి నిర్మల్ దేశపాండే డా॥ డి. ఎస్. పట్నాయక్ ప్రభృతులతోసహా దాదాపు 50 మంది ముఖ్యమైన సర్వోదయ కార్యకర్తల సమావేశం పై నిర్ణయం చేశారు.

ఈ సంస్థకు నిబంధనావళి రూపొందించుటకు ఏర్పాటు చేయబడిన అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ శ్రీ ప్రకాశంమహంతి ఒక పత్రికాప్రకటనలో సూచనలు యిచ్చేందుకు రాష్ట్ర కమిటీల సమావేశాలు ఏర్పాటు చేయవలసిందిగా రాష్ట్ర నాయకులను కోరడం జరిగిందని తెల్పారు.

అడ్‌హాక్ కమిటీ సంస్థ భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తుందని, ఈ కమిటీ సిద్ధం చేసిన చిత్తు నిబంధనావళిని జరగబోయే రాష్ట్ర మహాసభ ఆమోదానికి సమర్పించటం జరుగుతుందని ఆయన తెల్పారు.

ఆంధ్రా యూనివర్సిటీ పరీక్షా ఫలితాలు

వాల్తేరు, ఆగస్టు 16

1976 మే నెలలో ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించిన ఈ క్రింది పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నెంబర్లు యీ దిగువ యిస్తున్నాం.

ఎం. ఎ. డిగ్రీ పరీక్ష

బ్రాంచ్ VIII ఇంగ్లీషు లాంగ్వేజి అండ్ లిటరేచర్ IV సెమిస్టర్.

(సెమిస్టర్ సిస్టం క్రింద)

I II III IV సెమిస్టర్స్ కలుపుకొని డిస్టింక్షన్‌లో .. లేదు

ఫస్టుక్లాసు :- 495, 510 11 16 19 20.

సెకండ్‌క్లాసు :- 492 94 508 01 02 03 07 14 17 18

థర్డ్‌క్లాసు - 497 99 505 08 15.

498 506 509 512 513 నెంబర పరీక్ష ఫలితాలు తర్వాత ప్రకటించబడతాయి.

ఎన్నడూ లేనంత బలోపేతంగా భారత్

ఎర్రకోటపై జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తూ ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 16

అన్ని రంగాలలో దేశం ఏనాడూ లేనంత బలంగా వున్నదని ప్రధాని శ్రీమతి గాంధీ ప్రకటించారు.

నిరుపేదలకు సంతృప్తికరమైన సుఖమయ జీవితాన్ని కల్పించడంతోపాటుగా వారి అభ్యున్నతికై సాగే మహత్తర దిశగా భుజం భుజం కలిపి ముమ్మందుకు సాగిపోవలసిందిగా ఆమె దేశ ప్రజలకు పిలుపిచ్చారు.

నిన్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాంప్రదాయకంగా ఎర్రకోట బురుజు నుండి జాతినుద్దేశించి ప్రసంగిస్తూ ఆమె పై విధంగా అన్నారు.

దేశం తా నెన్నుకున్న పథంలోనే పయనిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.

శ్రీమతి గాంధి 30 నిమిషాల సేపు ఎంతో ఉద్వేగంతో ప్రసంగించారు. ఆమె ప్రసంగాన్ని ఎర్రకోటవద్ద చేరిన విస్తృత ప్రజానీకం శ్రద్ధగా విన్నారు. దేశమంతటా లక్షలాది ప్రజానీకం రేడియో, టెలివిజన్ ద్వారా విన్నారు.

ఈ సందర్భంగా 20 అంశాల ఆర్థిక కార్యక్రమం ఫలితాలను, భారత్‌పై విదేశీ దుమారం, కొలంబోలో అలీన దేశాల శిఖరాగ్ర సమావేశం గురించి ఆమె వివరించారు.

శ్రీమతి గాంధీ చారిత్రాత్మకమైన ఎర్రకోటవద్దకు రాగానే గౌరవ సూచకంగా 31 ఫిరంగులను ప్రేల్చారు.

ఈ సందర్భంగా ఆమె జాతీయ పతాకను ఎగురవేశారు.

మాజీరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి, కేంద్ర మంత్రులు. దౌత్య వ్యవహర్తలు కూడా పాల్గొన్నారు.

అత్యవసరపరిస్థితి సడలింపు విషయాన్ని ప్రస్తావిస్తూ, హింస, ఆందోళనలు, పని నిలుపుదల-యివన్నీ దేశానికి లెక్కలేనంత హానికరమయినవని యిప్పుడు విడుదలయిన వారు అంగీకరిస్తున్నారా లేదా, యింకా పాత పంథానే అనుసరించడం జరుగుతున్నదా అన్నదే సమస్య అని ఆమె తెలిపారు.

ఏమిజరుగుతుందో అన్నది మన చేతుల్లో విషయం కాదు, దేశాన్ని విచ్ఛిన్నంచేసి, క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రోత్సహించడంతోపాటుగా ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, అలీనతపై ఎటువంటి విశ్వాసం లేనివారిని లెక్కగట్టే వారిపై అది ఆధారపడి వుందని ఆమె అన్నారు.

ప్రజల్లో నూతన క్రమశిక్షణ నెలకొందని, అది బహిరంగంగా మరింత పెంపొందగలదన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు.

దేశం ముమ్మందుకు పయనిస్తోందని, అనేక సంవత్సరాల తర్వాత బలహీనవర్గాల అభ్యున్నతికి కార్యక్రమాలు ప్రారంభించి, శీఘ్రగతిన అమలుజరపక పోయినా జయప్రదంగానే అమలు చేయడం జరుగుతున్నది.

భారత్ లాంటి విశాల దేశంలో 70 లక్షల కుటుంబాలకు గృహవసతి కల్పించడం చాలా చిన్న విషయం. అయితే గతంతో పోల్చుకుంటే ఇది వాస్తవంగా పెద్దవిషయమని ఆమె పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో నిరుపేదల వాణినే వినటం జరుగుతుంది, అటువంటప్పుడు ఒక వ్యక్తి సామాజిక ఆర్థిక ప్రతిపత్తి ప్రాతిపదికపై ఇతరులపై ప్రాబల్యం వహించడానికి వీలుండదని అన్నారు.

భారత్‌పై విదేశాల విమర్శను ప్రస్తావిస్తూ భారత్ ఇలాంటివిమర్శలకు గురికావటం ఇది ప్రథమంగాదని, గాంధీజీ వుండగా ఆయనను గురించి పలు విమర్శలు చేశారని ఆ తర్వాత జవహర్‌లాల్ నెహ్రూపై గుప్పించారని ఆమె వివరించారు.

భారత్ అణుపరీక్షపై గగ్గోలు చేస్తున్నవారు అణ్వస్త్రాలను మెట్ట వేసుకుంటూ తమకు ఎటువంటి ప్రమాదంలేకున్నా రక్షణపై లక్షల కొలది వెచ్చిస్తున్న యితర దేశాలను విమర్శించడంలేదన్నారు, తద్భిన్నంగా తమకు ఆయుధాలు అమ్మాలని కోరుతున్నారని ఆమె తెలిపారు.

ఉక్కు కర్మాగారాలను ప్రస్తావిస్తూ వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధికి ఉక్కు మౌలిక మైందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల నిర్వహణ తీరును ఆమె ప్రశంసించారు.

దృఢమైన కృత నిశ్చయంతో దేశభక్తి యుతులుగా రూపొందవలసిందిగా ఆమె యువతరానికి విజ్ఞప్తి చేశారు.

ప్రధాని తన ప్రసంగాన్ని "జైహింద్", "భారత్ మాతాకి జై" అన్న నినాదాలతో ముగించారు.

శ్రీ బారువా ప్రసంగం

అత్యవసర పరిస్థితివల్ల లభించిన ఫలితాలను సంఘటితం చేసే ఆర్థిక కార్యక్రమాన్ని జయప్రదంగా అమలుచేయడం ద్వారా ప్రధాని హస్తాలను పటిష్టం చేయవలసిందిగా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ డి. కె. బారువా నిన్న కాంగ్రెసువాదులకు పిలుపిచ్చారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎ. ఐ. సి. సి. సెక్రెటేరియట్ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

జాతీయజెండాను ఎగురవేసిన అనంతరం, దేశ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన పాత్రను పునరుద్ఘాటించారు

సమావేశంలో ఎ. ఐ. సి. సి. ప్రధాన కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులందరూ ఢిల్లీ పి సి సి అధ్యక్షుడు, ఏస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్, అనేక యితర ప్రధాన కాంగ్రెసువాదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విదేశాల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు

మాస్కో, ఆగస్టు 16

మాస్కోలోని భారతీయులు నిన్న స్వాతంత్ర్య దినోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా రాయబారి శ్రీ ఐ. కె. గుజ్రాల్ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్రపతి సందేశాన్ని చదివి వినిపించారు.

సోవియట్ మహిళల కమిటీ నాయకులు భారత దౌత్యకార్యాలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యారు.

సోవియట్ పత్రికలు ఈ ఉత్సవం సందర్భంగా ప్రత్యేక శీర్షికలను ప్రచురించాయి.

మలేషియాలో

కౌలాలంపూర్‌లోని హైకమిషనర్ నివాస భవనంలో ఇక్కడి భారతీయులు స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకున్నారు.

పెకింగ్‌లో

పెకింగ్‌లోని, భారత దౌత్య సిబ్బంది నిన్న స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకున్నారు.

జెండా ఆవిష్కరణోత్సవంలో రాయబారి శ్రీ కె. ఆర్. నారాయణన్ రాష్ట్రపతి సందేశాన్ని చదివి వినిపించారు.

టోక్యోలో

టోక్యోలోను, యొకోహామాలోను భారతీయులు స్వాతంత్ర్య దినోత్సవాలను జరిపారు. ఈ ఉత్సవాలు యిక్కడి భారత దౌత్యకార్యాలయంలో జరిగాయి. భారత రాయబారి ఎరిక్ గన్‌స్లేవ్స్ 3 రంగుల జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రాష్ట్రపతి సందేశాన్ని చదివి వినిపించారు.

తూర్పుజర్మనీ శుభాకాంక్షలు

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూర్పుజర్మనీ నాయకులు రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు, ప్రధాని శ్రీమతి గాంధీలకు తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

సోషలిస్టు యూనిటీ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎరిక్ హోనెకర్, స్టోఫ్, ప్రధాన మంత్రి షిండర్‌మన్‌లు తమ సందేశాలను పంపారు.

బంగ్లా శుభాకాంక్షలు

బంగ్లాదేశ్ అధ్యక్షుడు ఎ.యం. సయీమ్ ఒక సందేశంలో రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉభయ దేశాల మధ్య స్నేహ సహకారాలు మరింత పటిష్టం కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

అవార్డులు

న్యూఢిల్లీ, ఆగస్టు 16

సంస్కృతం, అరబిక్, పర్షియన్ భాషలలో ఈ క్రింది వారికి రాష్ట్రపతి గౌరవ పత్రాలను అందజేశారు.

సంస్కృతంలో: శ్రీయుతులు అగ్నిహోత్రం రామానుజ తాతాచార్య, భూపేంద్రనాథ్ భట్టాచార్య, దుర్గాదత్ శాస్త్రి, కరూర్ అనంతరామ్, శివరామకృష్ణశాస్త్రి ఆచార్య పట్టాభి ప్రభాకర్ లిమాయే, యుధిష్ఠిర మీమాంసకి.

అరబిక్‌లో: సయ్యద్ షాఉద్దీన్ శాస్త్రి నద్వి.

పర్షియన్‌లో: ఇక్బాల్ హుస్సేన్.

గౌరవ కమిషను

భారత విమానదళంలోని మాస్టర్ వారంట్ ఆఫీసర్లు వారంట్ అధికారులకు 2ం గౌరవ కమిషను బహూకరించారు.

సైన్యంలో 563 మంది నాన్ కమిషను ఆఫీసర్లకు నాయిబ్ రిసల్దార్, నాయిబ్ సుబేదార్ గౌరవ ర్యాంకులను రాష్ట్రపతి బహూకరించారు.

ముఖ్యమంత్రి

[1 వ పేజీ తరువాయి]

పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలు ముఖ్యమంత్రి బహూకరించారు.

రేడియో ప్రసంగం

ఐక్యతద్వారా సోషలిజాన్ని సాధించాలని నిన్న రాత్రి ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు తన రేడియో ప్రసంగంలో రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు

ప్రత్యేక ఆందోళనల ద్వారా పెరిగిన వైషమ్యాలు ప్రధాని ప్రకటించిన షట్సూత్ర పథకం ద్వారా తొలగించబడిందని, ప్రపంచ తెలుగు మహాసభ తెలుగు ప్రజల మధ్య నూతన సంబంధాలను అభివృద్ధి పరచిందని అన్నారు.

దళిత వర్గాల వారు ఏ ప్రాంతానికి చెందిన వారైనా సరే వారి సంక్షేమానికి సంఘంలో వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

ప్రాంతీయ వైషమ్యాలు, ఆందోళనలు సోషలిజం సాధనమార్గానికి అడ్డుపడతాయని ఆయన అన్నారు.

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలలో నేడు ఒక విధమయిన సంతృప్తి నెలకొని వుందని, ప్రత్యేకంగా ప్రభుత్వోద్యోగులు ప్రాంతీయ భేదాలను విస్మరించి దీక్షతో పని చేస్తున్నారని ఆయన అన్నారు.

ధరల అదుపుకు బ్లాకు మార్కెటీర్లు, అక్రమ నిల్వదారులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలు సంపూర్ణంగా బలపరుస్తున్నారని, ఈ దశలో మరికొన్ని సమర్థవంతమయిన చర్యలు తీసుకొనే స్థితిలో వున్నామని ఆయన అన్నారు.

సంఘ వ్యతిరేకశక్తులు పొంచియున్నప్పటికీ ప్రజలనుండి తోడ్పాటు లేనందువల్ల నిస్సహాయంగా వున్నాయని అన్నారు.

8 లక్షల ఎకరాల బంజరు భూమిని భూమిలేని పేదలకు పంచామని, భూసంస్కరణలు త్వరితం చేసేందుకు తీవ్రకృషి జరుగుతున్నదని, ఇంతవరకు 87,000లక్షల రక్షిత కౌల్దార్లు యజమానులయ్యారని ముఖ్యమంత్రి వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో 16 లక్షల కుటుంబాలకు ఇండ్లస్థలాలు అవసరమని వారిలో 4, 67 లక్షలమందికి గత 16 నెలల్లో పట్టాలిచ్చామని ఆయన చెప్పారు.

ఒంగోలులో

ప్రకాశంజిల్లాలో 3,209 ఎకరాల మిగులు భూమి లభించిందని జిల్లా కలెక్టరు శ్రీ కె. స్వామినాథన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒంగోలు పోలీసు పెరేడ్ గ్రౌండ్సులో జరిగిన సభలో భూసంస్కరణల అమలులో సవివరంగా తెలిపారు.

తొలుత కలెక్టరుకు మార్కాపురం డి యస్. పి. అజమాయిషీలో జిల్లా సాయుధ పోలీసు గౌరవ వందనం సమర్పించింది.

డి ఆర్. ఓ. శ్రీనారాయణరెడ్డి ప్రకాశం భవనంపై జాతీయ జండాను ఎగుర వేశారు.

మచిలీపట్నంలో

మచిలీపట్నం పోలీసు పెరేడ్ గ్రౌండ్సులో జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఇన్‌ఛార్జి శ్రీ ఎం. కె. మహాపాత్ర ఆవిష్కరించారు.

తొమ్మిదిమంది స్వాతంత్ర్య యోధులకు తామ్రపత్రాలను పంపిణీ చేశారు.

అత్యధికుల హక్కుల రక్షణకే రాజ్యాంగ సవరణలు: ప్రధాని ఇంటర్వ్యూ

న్యూఢిల్లీ, ఆగస్టు 14

రాజ్యాంగసవరణలు చెయ్యటంలో ప్రధాన ఉద్దేశ్యం ఎవరివ్యక్తిగత హక్కులను అరికట్టడం కాదని, అధిక సంఖ్యాకులు వాటిని అనుభవించే విధంగా చేసి సమాజం యింకా ముందుకు వెళ్ళే విధంగా చెయ్యడమేనని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నేడు తెలియజేశారు.

రాజ్యాంగం రూపొందించబడిన ఆ మరుసటి సంవత్సరం నుండి సవరణలు చెయ్యబడుతున్నాయని, 1955 కు ముందు ఏర్పడిన కమిటీ అనేక సవరణలను సూచించిందని పేర్కొన్నారు.

సోషలిస్టు ఇండియా, సోషలిస్టు భారత్ పత్రికల సంపాదకుడు శ్రీ నావల్ కిశోర్ శర్మకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజ్యాంగానికి చెయ్యనున్న సవరణలను గూర్చి ఆమె వివరించారు.

దేశంలో కొన్ని ప్రతిపక్షాలు కలసి ఒకే పార్టీగా రూపొందాలని చేసే ప్రయత్నాలు అలీన దేశాల శిఖరాగ్ర మహాసభ ఇంకా తదితర అనేక ప్రశ్నలపై ఆమె సమాధానాలిచ్చారు.

ప్రపంచం మొత్తంగా అటువంటి మార్పులు జరుగుతున్నాయన్నారు.

"కొన్ని చట్టాలు సమాజ పురోభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నాయి. మొదట రాజ్యాంగాన్ని రూపొందించినవారు ఈ విధంగా మార్పు చెందటానికి అంగీకరించరు" అని శ్రీమతి గాంధీ అన్నారు. అధిక సంఖ్యాక ప్రజలు సిద్ధాంతరీత్యా యీ హక్కులు కల్గియున్నారు. ఆచరణాత్మకంగా కాదు. వారి కర్తవ్యాలను వారు పూర్తిగా నిర్వహించటంలేదు ప్రతివారు అవసరమైన, విద్య, ఆరోగ్యాన్ని పొందటంలేదు" అని ఆమె చెప్పారు.

ఈ విధానం వారికి తగిన సౌకర్యాలను అందచెయ్యనప్పుడు ఎందుకు దాన్ని అనుసరించాలని ఆమె ప్రశ్నించారు. ఈ విధానం మారాలి అని ఆలోచించేంతవరకు మాత్రమే అంగీకరిస్తారు.

ఒకసారి ఆ విధంగా ఆలోచించినట్లయితే దాన్ని తొలగిస్తారని ఆమె చెప్తూ ఆ విధంగానే అనేక దేశాల్లో విప్లవాలు జరిగాయని తెలిపారు.

ప్రతిపక్షాలతోను, దేశంలో ఏర్పాటు చెయ్యాలనుకున్న ఏకప్రతిపక్ష పార్టీల యొక్క కాంగ్రెస్‌పార్టీ సంబంధాలనుగూర్చి ప్రశ్నించగా ప్రతిపక్షపార్టీని వ్యతిరేకించవలసిందే కాని విచ్ఛేదం చెయ్యవలసింది కాదన్నారు.

ప్రతిపక్ష పార్టీలనుండి సహకారం లభించినట్లయితే వారితో సహకరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

"వారంతా ఎందుకు ఒక పార్టీగా ఉండాలనుకున్నారు" ఒక పార్టీగా ఉండి భారత దేశంలో ఇంకా ఎక్కువ సాధించాలనుకున్నారు" అని శ్రీమతి గాంధీ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఉన్నటువంటి ప్రభుత్వాన్ని ఎలా తొలగించాలనే విషయంపైన మాత్రమే వారు ఒక పార్టీగా ఏర్పడాలనుకున్నారు అని ఆమె చెప్పారు.

కృష్ణాజిల్లా అభివృద్ధి మహాసభ

ఆగస్టు 21, 22 తేదీలలో విజయవాడలో

[విశాలాంధ్ర విలేకరి]

విజయవాడ, ఆగస్టు 16

కృష్ణాజిల్లా అభివృద్ధి మహాసభ ఆగస్టు 21, 22 తేదీలలో విజయవాడ పిర్క్స్ హాలులో జరుగనున్నది.

మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షులు శ్రీ వెనిగళ్ళ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీ కిలారు శ్రీనివాసమూర్తి పత్రికావిలేకరుల గోష్ఠిలో పై వివరాలను వెల్లడించారు

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం, భారత సోవియట్ సాంస్కృతిక సంఘం ఇండో-జి డి ఆర్ మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి, అఖిల భారత స్థాయి అభివృద్ధి మహాసభలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కృష్ణా జిల్లాలో జరగనున్నది.

రాష్ట్ర మంత్రులు శ్రీ వి. పురుషోత్తమరెడ్డి, శ్రీ పి. నర్సారెడ్డి శ్రీ అనుమోలు వెంకట్రావు, శ్రీ యం. వి. కృష్ణారావులు యీ సభకు హాజరు కానున్నారు. కృష్ణాజిల్లాలో 20 అంశాల ఆర్థిక కార్యక్రమం అమలు, జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిశీలన, ప్రజా జీవితాన్ని సుఖమయం చేయటానికి చేపట్టవలసిన పథకాలు మొదలైన వాటిపై యీ మహాసభలో ప్రవేశపెట్టే పత్రాలపై చర్చలు, నిర్ణయాలు జరుగుతాయి.

కపిలేశ్వరపురంలో 4 వేల మందితో కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీల ఊరేగింపు

ఆలమూరు ఆగస్టు 16 తూర్పుగోదావరిజిల్లా కపిలేశ్వరపురం గ్రామంలో 20అంశాల కార్యక్రమం అమలు కోరుతూ కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యాన 4 వేల మందితో ఊరేగింపు జరిగింది

ఊరేగింపులో అధికంగా కార్మికులు పాల్గొనడం విశేషం ఈ ఊరేగింపుకు పార్లమెంటు సభ్యులు శ్రీ యస్. బి. పి. పట్టాభిరామారావు, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ, తాలూకాపార్టీ కార్యదర్శి శ్రీ పాలచర్ల పనస రామన్న, జిల్లా కాంగ్రెసు నాయకులు శ్రీ బొర్రా సత్యనారాయణ, యింకా రైతు, వ్యవసాయ, యువజన సంఘాల కార్యకర్తలు నాయకత్వం వహించారు.

ఊరేగింపు అనంతరం జరిగిన పెద్ద బహిరంగ సభలో శ్రీయుతులు ముళ్ళపూడి సూర్యనారాయణ, యస్. బి. పి. పట్టాభిరామారావు ప్రసంగిస్తూ దేశ రాజకీయ ఆర్థిక పరిస్థితిలో వచ్చిన మార్పులు, మితవాద శక్తుల కుట్రలు, వాటిని ఎదుర్కొంటూ ప్రజాసమస్యల పరిష్కారానికై ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

(వి. వి.)

జగ్గయ్యపేట పి. డబ్ల్యు. డి. వర్క్‌షాప్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ

జగ్గయ్యపేట, ఆగస్టు 16

జగ్గయ్యపేట పి డబ్ల్యు. డి వర్క్‌షాప్ (ఎన్. యస్. సి.) ఎంప్లాయీస్ యూనియన్ ద్వితీయ మహాసభ పట్టణ ట్రేడ్‌యూనియన్ కార్యాలయంలో ఈనెల 8 వ తేదీన జరిగింది.

శ్రీయుతులు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, వి. నర్సయ్య కె. శశిధర్ కుమార్, ఎస్. కృష్ణారావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీ వి. రామమూర్తి, పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ జి. వి. ప్రసాద్ సందేశాలిచ్చారు,

నూతన సంవత్సరానికి శ్రీ పిల్లలమర్రి గౌరవాధ్యక్షులుగా, శ్రీ వి. నరసయ్య అధ్యక్షులుగా, శ్రీ కె శశిధర్‌కుమార్, శ్రీ ఎస్. కృష్ణారావు ఉపాధ్యక్షులుగా, శ్రీ వి. వి. నరసయ్య ప్రధాన కార్యదర్శిగా, శ్రీ ఎస్. ఎ. ఖాదర్ సహాయ కార్యదర్శిగా, శ్రీ జి. వి. సుబ్బారావు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, శ్రీ ఎ.వి రాఘవులు కోశాధికారిగా, మరో 10 మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

సభలు-సమావేశాలు

ఆగస్టు 27 వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ స్టేట్‌బ్యాంకు ప్రక్కనున్న తూర్పుగోదావరి జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ భవనంహాలులో పై అసోసియేషన్ వార్షిక మహాజనసభ జరుగుతుంది.

సోషలిస్టు సమాజస్థాపనకై ఉద్యమంలో విద్యార్థుల ప్రముఖ పాత్ర: గుంటూరు సభలో వక్తల ఉద్ఘాటన

[విశాలాంధ్ర విలేకరి]

గుంటూరు, ఆగస్టు 16

శాస్త్రీయ విద్యావిధానం, సోషలిస్టువ్యవస్థ సంస్థాపనకై విద్యార్థిలోకాన్ని సమీకృతం చేసి ఉజ్వల పోరాట సాంప్రదాయాలను సంతరించుకున్న అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్‌ను మరింత పటిష్టం చేయాల్సిన అవసరమెంతైనా వుందని వక్తలుఉద్ఘాటించారు.

అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 40 వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణవిద్యార్థి ఫెడరేషన్ఆధ్వర్యాన యిటీవల ఇన్నిస్‌భవనంపై జరిగిన సభలో మాట్లాడుతూ వారు పై విధంగా అన్నారు.

మొన్న వుదయం హిందూకళాశాల, ఏ. సి. కళాశాల టి జె.పి.యస్. కళాశాల, ప్రభుత్వ స్త్రీల కళాశాల, బ్రాడీపేటలోని శంకర్‌విలాస్ సెంటర్‌లలో విద్యార్థి ఫెడరేషన్ పతాకములను ఆవిష్కరించారు.

ఈ నెల 3 వ తేదీనుంచి హైస్కూలు కళాశాలల విద్యార్థులకు ఆటలు, పాటలు, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు.

పట్టణ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ కె శివరామిరెడ్డి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది.

అంతకు ముందు విద్యార్థి ఫెడరేషన్ పతాకాలు బ్యానర్లతో విద్యార్థులు, విద్యార్థినులు విద్యార్థి ఫెడరేషన్ వర్ధిల్లాలి, 40 వ వార్షికోత్సవం వర్ధిల్లాలి శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలుపర్చాలి అని నినదిస్తూ పట్టణ వీధుల్లో పూరేగింపు జరిపారు.

టి జె పి. యస్. కళాశాల విద్యార్థి ఫెడరేషన్ నాయకులు శ్రీ యస్. వెంకటేశ్వర్లు స్వాగతం పలికి వక్తలను ముఖ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

ఆంధ్రప్రదేశ్ యువజనసమాఖ్యఅధ్యక్షులు శ్రీ బి. స్టాలిన్‌బాబు, జిల్లాయువజన సమాఖ్య, మాజీ అధ్యక్షులు శ్రీ యస్ వెంకటప్పయ్య గుంటూరుపట్టణ విద్యార్థి ఫెడరేషన్ మాజీ కార్యదర్శి శ్రీ యం. నాగేశ్వరరావు, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ జి సుబ్బారావు వేదికపైన ఆసీనులయ్యారు.

వారితోపాటు ఆటల పోటీలు నిర్వహించుటకు తోడ్పడి సహకార మందించిన డ్రిల్లు టీచర్లు సర్వశ్రీ యం. పుల్లారావు, (యస్. పి. యస్. హైస్కూలు) సత్యానందం (యల్. యమ్. హెచ్. హైస్కూలు), జ్ఞానసుందరం (ఓరియంటల్ హైస్కూలు), రామస్వామి (హిందూ హైస్కూలు), జయరావు (జలగం రామారావుహైస్కూలు) కూడా వేదికపై ఆసీనులయ్యారు.

స్టాలిన్ బాబు

శ్రీ బి. స్టాలిన్‌బాబు ప్రసంగిస్తూ 1936 ఆగస్టు 12 వ తేదీన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ లక్నో నగరంలో భారత జాతీయోద్యమ నాయకులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారిచే ప్రారంభించబడిందని ఎందరో ప్రముఖులు ఆనాడు విద్యార్థి ఫెడరేషను నిర్మించుటలో భాగస్వాములని 40 సంవత్సరాల ఉజ్వల చరిత్రను రేఖా మాత్రంగా వివరించారు.

ఉద్యోగ కల్పనతో కూడిన శాస్త్రీయ విద్యావిధానాన్ని దేశంలో రూపొందించుకొని అమలు జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనావుందని ఆయన నొక్కి చెప్పారు.

శ్రీ యస్, వెంకటప్పయ్య మాట్లాడుతూ నేటి పాఠ్యాంశాలలో ప్రజాస్వామ్యాన్ని ప్రగతిశీల అభ్యుదయకరశక్తులను, దేశపురోభివృద్ధికి అవరోధాలను అభివృద్ధి నిరోధకశక్తుల పాత్రను వివరించే శాస్త్రీయ విధానం ఏర్పరచుకొనుటకు విద్యార్థులు విద్యార్థి ఫెడరేషన్ నాయకత్వాన సమీకృతులై ఉద్యమించాలని అన్నారు.

శ్రీ యమ్. నాగేశ్వరరావు మాటాడుతూ ఇంతవరకు గుంటూరు పట్టణ విద్యార్థి ఫెడరేషన్ అత్యధికంగా కళాశాలల విద్యార్థుల సమస్యలపైనే కేంద్రీకరించి కృషి చేసిందని, ఇక ముందు హైస్కూలు విద్యార్థుల సమస్యలపైన కృషి చెయుటకై రూపొందించి ప్రతి హైస్కూలులోను విద్యార్థి ఫెడరేషన్‌ను ఏర్పరచాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణ విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ యస్. వి. హెచ్. ప్రసాద్ పోటీలలో పాల్గొన్న విజేతల పేర్లు చదివారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ జి. సుబ్బారావు బహుమతులను అందచేశారు.

సభా ప్రారంభంలో టి. జె పి యస్ కళాశాల విద్యార్థి టి యస్ యస్ ఆర్. శర్మ ఆకాశవాణి ఇంకా కొందరు ప్రముఖ నటులు, ధ్వనులు, మిమిక్రీల ప్రదర్శించారు. ఈవిద్యార్థి మిమిక్రీలు ధ్వన్యనుకరణల్లో ఎంతో నటిభను ప్రదర్శించి సభికులను ముగ్ధులను కావించారు.

వక్తృత్వ, పాటల పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టరు రాంప్రసాద్, జంగాల సీతారామయ్య, రాధాకృష్ణమూర్తి, వ్యాసరచన పోటీలలో డాక్టర్ రాంప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

క్విజ్ మాస్టర్‌గా హిందూకళాశాల అంగ్ల విభాగం లెక్చరర్ శ్రీ టి ఏ. జి. కృష్ణమూర్తి వ్యవహరించారు.

తల్లులకు ఆహారం తక్కువైతే బొద్దుగా వుండే బిడ్డలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16

గర్భవతులుగా వున్న మహిళలకు మొదటి 6 నెలల్లో ఆహారం తక్కువగా పుండటంవల్ల, వారికి పుట్టే బిడ్డలు బొద్దుగ వుండే అవకాశంవుందని ఇక్కడ జరిపిన ఒక అధ్యయనంలో తెలిసింది.

ప్రసవించడానికి ముందు మూడు నెలల్లో ఎక్కువ ఆహారం తీసుకొనే మహిళలకు పుట్టేబిడ్డలు సన్నగా వుంటారని తెలిసింది.

న్యూయార్క్‌కు చెందిన కొలంబియా యూనివర్శిటీ, ప్రజారోగ్య శాఖ డాక్టరు మెర్విన్‌సుస్సర్ డా॥జెరస్టీన్ దంపతులు జరిపిన అధ్యయన నివేదికను ప్రచురించింది.

మహిళలు గర్భవతులుగా వున్నప్పుడు సరైన పోషకాహారంతీసుకోకపోతే వారికి పుట్టే పిల్లలు పెద్దవారు అయిన తర్వాత కూడా ఆ ప్రభావం వుంటుందని డా॥ సుస్సర్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు.

గర్భవతులైన మొదటినెలల్లో సరైన పోషక ఆహారం తీసుకోకపోతే ఆ స్త్రీకు పుట్టే పిల్లలకు మెదడులో ఆకలిని అదుపులో పెట్టే హైపోథలమస్ దెబ్బతీస్తుందన్న సిద్ధాంతం ఇందువలన రుజువైందని డా॥ సుస్సర్ తెలియచేశారు.

బిడ్డలకు మొదటి కొద్ది మాసాల్లో ఎక్కువ తిండి పెట్టడంవలన అంతర్గతంగా వున్న క్రొవ్వుతో గూడిన సెల్సు జీవితమంతా బరువు పెరగడానికి దారితీస్తుందని భావించబడుతోంది.

1944 అక్టోబరు 1945 మే మధ్యకాలంలో నెదర్లాండ్స్‌లో పోషకాహారం లేని [illegible] 94 వేల మందిపై ఈ అధ్యయనం జరపబడింది.

గమనిక

ఈ సంచిక 5 వ పేజీలోని బ్లాకు క్రింద "హైద్రాబాద్‌సభలో అ. భా. విద్యార్థి ఫెడరేషన్ నిర్మాతల్లో ఒకరైన శ్రీ రుస్తుం సటిన్‌ను ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ నివాసులు నాయుడు సన్మానించినప్పటిదృశ్యం అని చదువుకోవలసిందిగా ప్రార్థన. సం॥

57 గ్రామాలలో సంఘాల నిర్మాణం

నందిగామ తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ నిర్ణయం

నందిగామ ఆగస్టు 16

కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో 12 వేల సభ్యత్వం చేర్పించాలని, 57 గ్రామాలలో సంఘాలు పెట్టాలని, 125 "కూలిదండు" పత్రిక చందాలు చేర్పించాలని, తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తల సమావేశం కార్యక్రమం తీసుకుంది

ఈ సమావేశం యీ నెల 9 న నందిగామలో శ్రీ ఖిల్లి వెంకయ్య అధ్యక్షతన జరిగింది.

జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ ఖద్దు దేవసుందరం రాష్ట్ర, జిల్లా సంఘాల నిర్ణయాలు వివరించారు, తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ సూర్యదేవర నాగేశ్వరరావు తాలూకాలో పాదయాత్రల ద్వారా దాదాపు 90 గ్రామాలలో రుణాలకై, బంజరు పట్టాలకై, ఇళ్ళ స్థలాలకై దరఖాస్తులు సేకరించి జరిపిన కృషిని, సాధించిన విజయాలను వివరించారు

తర్వాత సెప్టెంబరు 15 వ తేదీకి పై కార్యక్రమం పూర్తిచేయాలనినిర్ణయించారు.

తహశీల్దారుకు మెమోరాండం

అనంతరం సమావేశానికి హాజరయిన 100 మంది కార్మికులతో తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ జల్లి ఏసోబు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యవర్గ సభ్యులు శ్రీ పట్టికొండ నాగేశ్వరరావు పట్టణ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ షేక్ ఖుదేసాహెబ్, తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు శ్రీ జెవెల్లి చిన్న పూలాలి, పైడలు నాయకత్వాన తహశీల్దారు వద్దకు వెళ్ళి మెమొరాండం సమర్పించారు

వాడకందార్లకు నూనె అందుబాటు

ప్రకాశం జిల్లాలో కలెక్టర్ చర్య

(విశాలాంధ్ర విలేకరి)

ఒంగోలు, ఆగస్టు 16

ఒంగోలు పట్టణంలో ఇటీవల వంట నూనె ధర అకస్మాత్తుగా పెరిగినందున జిల్లా కలెక్టరు శ్రీ కె. స్వామినాథన్ పట్టణములోని టోకు చిల్లర నూనె వ్యాపారస్తులందరిని సమీకరించి వారివద్ద నుండి కిలో రు 6-50 లకు, పదిహేను కిలోల సెనగనూనెను స్వచ్ఛందంగా సేకరించి కేంద్ర సహకార స్టోర్సుకు ఇప్పించారు కేంద్ర సహకార స్టోర్సు ఈ నూనెను వాడకందార్లకు కిలో రు 6-65 ల చొప్పున అమ్మకం చేస్తున్నది

జిల్లా కలెక్టరు చర్య ఫలితంగా ఒంగోలు జిల్లాలోని నూనె మార్కెటు వాడకందార్లకు అందుబాటులోకి వచ్చింది.

ప్రధాని 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని
గుంటూరు జిల్లాలో విజయవంతంగా
అమలు జరపడంలో ముఖ్యపాత్ర వహిస్తున్న
శ్రీ చేబ్రోలు హనుమయ్యగారు
మంత్రివర్యులుగా ప్రమాణస్వీకారం
చేయు శుభతరుణంలో ఇవే మా శుభాభినందనలు

సౌత్ ఇండియా లీఫ్ టుబాకో కంపెనీ
టుబాకో గ్రోయర్స్ అండ్ ప్యాకర్స్
★
మద్దిపాడు
ఫోన్ నెం. 38

బలహీనవర్గాల కొరకు నడుంకట్టి దశాబ్దాల నుంచి
జిల్లా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో
గణనీయమైన కృషి చేస్తున్న
గుంటూరుజిల్లా నాయకులు
శ్రీ చేబ్రోలు హనుమయ్యగారు
మంత్రివర్యులుగా ప్రమాణస్వీకారం
చేయు శుభసమయంలో
మా హృదయపూర్వక సుమ సుమాంజలులు

కంచర్ల లక్ష్మీనారాయణ,
బండ్లమూడి సుబ్బయ్య
టుబాకో గ్రోయర్స్, ప్యాకర్స్
★
మోతడక
ఫోన్ నెం : 22168

శ్రీ చేబ్రోలు హనుమయ్యగారు
మంత్రి వర్యులుగా నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న
శుభ తరుణంలో నా హృదయపూర్వక శుభాకాంక్షలు

కొండా వెంకటేశ్వరరెడ్డి
మాజీ మున్సిపల్ కౌన్సిలర్
పాత గుంటూరు
ఫోన్ నెం 22302

మంత్రివర్యులు శ్రీ చేబ్రోలు హనుమయ్యగారికి
నా హృదయపూర్వక శుభాకాంక్షలు



గొలుసు కొండల్రావు
డి. సి. సి. ట్రెజరర్
రైలుపేట – గుంటూరు
ఫోన్ : నెం. 22302

శ్రీ చేబ్రోలు హనుమయ్యగారు మంత్రివర్యులుగా
ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా
